
అత్తరు సాయిబు ఇంటిని వెతుక్కుంటూ బయలు దేరాను. "అత్తరూ!' అనే అరుపుని విని చాలా రోజులయింది. అతను మా వీధిలోకి అత్తరుతో వచ్చిన సూచనగా ఇంకా ఇరవై అడుగుల దూరంలో ఉండగానే గాలి సుగంధ భరితమైన పరిమళాన్ని మోసుకొస్తుంది. అందరూ ఎంతో మక్కువతో కొనుక్కుంటారు. కాని సుమారు నెల రోజుల నుంచి 'అత్తరు సాయిబు' రావడం లేదు. అతను రాకపోవడంలోని కారణాన్ని రకరకాలుగా చెబుతున్నారు. కొందరు పక్షవాతం వచ్చిందన్నారు. మరికొందరు అత్తరు చెయ్యడం మానేసి మరేదో పని చేస్తున్నాడన్నారు.

# అత్తరు

గోపరాజు ఉమానరసింహారావు



నేను ప్రతి నెలా అతని దగ్గర గులాబీ అత్తరు తీసుకుంటాను. అది ఎలా తయారుచేస్తాడో తెలియదు కాని వాసన చూస్తుంటే మాత్రం అప్పుడే కోసిన గులాబీ పువ్వుని వాసన చూస్తున్నట్లుంటుంది. అదే విషయం అడిగితే "అంతా నా జరీనా తల్లి చేతి మహత్యం" అంటాడు. జరీనా అతని కూతురు.


అప్పుడప్పుడూ నా దగ్గర కూర్చుని తన కష్ట సుఖాలు చెప్పుకునేవాడు. అతని ఆలోచనలన్నీ కూతురి చుట్టూ పరిభ్రమిస్తూ ఉంటాయి. జరీనా సుఖపడడమే జీవితశయం. కోటీశ్వరుడికి పుట్టి సుకుమారంగా పెరగాల్సిన జరీనా పొరపాటున అత్తరు అమ్ముకుని జీవించే పేద కుటుంబంలో పుట్టిందని అతని అభిప్రాయం. అద్భుతంగా అత్తరు చేసి ఎంతో మందికి మధురానుభూతిని ఇచ్చిన జరీనాకి బంగారం లాంటి మొగుడొస్తాడని నమ్మకం. మాటల సందర్భంలో కూతురి ప్రసక్తి వస్తే చాలు అతని మోము ఆనందంతో వికసించేది. నోరు తెరిస్తే చాలు తొంభై శాతం మాటలు అత్తరు గురించి గాని, కూతురి గురించి గాని మాత్రమే వస్తాయి. అతను చిన్నప్పట్నుంచీ అత్తరు మధ్యనే బ్రతికాడు. వాళ్ళ వంశమంతా అదే చేసి అమ్ముకుంటూ జీవనం గడిపారు. అల్లుడు కూడా "అత్తరు సాయిబే' కావాలని కోరిక.

సుగంధ ద్రవ్యాన్ని తయారు చేసే 'అత్తరు సాయిబు' ఇంత దుర్గంధ భూయిష్టమైన ప్రదేశంలో జీవిస్తున్నాడా? ముక్కు పగిలిపోతుంటే జేబులోంచి జేబురుమాలు తీసి అడ్డం పెట్టుకున్నాను. ఊరి చివర మురికివాడలో ఉంటున్నట్లు ఎప్పుడో చెప్పినట్లు గుర్తు. ఒక్కొక్క గుడిసెని, మనుషుల్నీ పరీక్షిస్తూ నడుస్తున్నాను.

నా కెందుకో జరీనాని చూడాలనిపించేది! 'అత్తరు సాయిబు' అప్పుడప్పుడూ అన్న మాటలను మాలగా గుచ్చి ఆమె రూపాన్ని మనస్సులో ఊహా చిత్రంగా గీశాను. నేను వృత్తి రీత్యా ఉపాధ్యాయుడినే అయినా ప్రవృత్తి రీత్యా రచయితని, నేను రాసిన కథలు పత్రికల్లో పడుతూ ఉంటాయి. ఆ తండ్రీ కూతుళ్ళ అనుబంధం గురించి ఒక కథ రాయాలని ఎన్నోసార్లు అనుకున్నాను. కాని కథని ఎలా ప్రారంభించాలో ఎలా ముగించాలో తెలియక రాయలేదు. జరీనా జీవితం ఏదైనా విచిత్రమైన మలుపు తిరిగిందా?

అన్నట్లు జరీనాకి పెళ్ళి కుదిరిందని కొన్నాళ్ళ క్రితం చెప్పాడు. నేను తప్పకుండా వస్తానని హామీ కూడా ఇచ్చాను. బహుశా అదే ఆఖరి కలయిక అనుకుంటాను. మళ్ళీ కనబడలేదు. జరీనాకి పెళ్ళయి అత్తారింటికి వెళ్ళిపోయిందా? అయినా నాకు తెలియకుండా పెళ్ళి చెయ్యడు.

హఠాత్తుగా నా కాళ్ళు ఒక గుడిసె ముందు ఆగిపోయాయి. నులక మంచం మీద పడుకున్న ఆ వ్యక్తి అత్తరు సాయిబా? నమ్మశక్యంగా లేదు. శరీరంలోని ఎముకలన్నీ కనబడుతున్నాయి. ముసురుకుంటున్న చీకట్లలో ఆ వ్యక్తి రూపం సరిగ్గా గుర్తుపట్టలేక దగ్గరకు వెళ్ళి పరిశీలనగా చూశాను. అవును అనుమానం లేదు ఆ ఎముకల గూడు అత్తరు సాయిబుదే. అయ్యో ఇలా అయిపోయాడేమిటి? చెప్పలేని బాధతో నా మనస్సు మూలిగింది. అతని శరీరం కదలిక లేకుండా శవంలా ఉంది తప్ప ఇక్కడా జీవం ఉన్న లక్షణాలు లేవు. బ్రతికున్న మనిషంటే ఎవరూ నమ్మరు.



'అన్నపూర్ణా!'

"అన్నపూర్ణా, భిక్షాందేహి!" అరిచాడు భిక్షగాడు.
"నీ నోరు పడిపోను. పేరు పెట్టి పిలుస్తా వేమిరా!" అరిచింది ఇంటి యజమాని అన్నపూర్ణ.

అడబాల సూర్యనారాయణ [తుని]

నా అలికిడి విని కాబోలు కళ్ళు తెరిచాడు. పిల్లలు ఆడుకునే గాజు గోళీల్లా ఉన్నాయవి. ఒళ్ళంతా కోసి గట్టిగా పిండినా ఒక్క రక్తం చుక్క కూడా పడేలా లేదు. గెడ్డం పెరిగిపోయి ఉంది. తైల సంస్కారం లేని జుట్టు పిచ్చుకల గూడులా ఉంది. గబగబా లేవడానికి ప్రయత్నించాడు కాని శరీరం సహకరించలేదు. బహుశా అన్నం తిని చాలా రోజులైంది కాబోలు. ఇంట్లోకి చూశాను. ఇల్లంతా నిశ్శబ్దంగా ఉంది. నా గుండె ఝల్లుమంది. జరీనా ఏమైంది? తండ్రిని ఈ పరిస్థితిలో వదిలేసి ఎక్కడి కెళ్ళి పోయింది?

గుడిసె లోపలికి వెళ్లాను. అత్తరు తయారుచేసే పాత్రలూ, సీసాలు చెల్లా చెదురుగా పడి ఉన్నాయి. ఒక బుట్టనిండా ఎండిపోయిన గులాబీ పూలున్నాయి. అతను ఎక్కువగా గులాబీ అత్తరునే తయారుచేస్తాడు. చాలామంది దానినే ఇష్టపడతారు. బయటికొచ్చాను. నేను రావడం చూసి చుట్టుపక్కల గుడిసెల వాళ్ళు నలుగురైదుగురు వచ్చారు. "మీరైనా చెప్పండి బాబూ! అసలేమీ తినడం లేదు" అన్నాడు ఒకతను బాధగా. అతని చేతిలో గోధుమ రొట్టెలు రెండున్నాయి.

'అత్తరు సాయిబు'ని మంచంమీద వాళ్ల సాయంతో కూర్చోబెట్టి రొట్టె కొంచెం విరిచి బలవంతంగా నోట్లో పెట్టాను. "జరీనా ఏదీ?" యథాలాపంగా అడిగాను. ఘొల్లుమని ఏడుపు ప్రారంభించాడు.కళ్లలో నుంచి కన్నీళ్లు ఉబికి వచ్చాయి. వీపుమీద రాస్తూ అలాగే ఉండిపోయాను. బరువెక్కిన హృదయం తేలికవ్వాలంటే మనసారా ఏడవనివ్వడం మంచిది. ఆ కన్నీరు జరీనాకి జరగరానిదేదో జరిగినట్లు చెబుతోంది. అతని కలలు కూలిపోయాయి కాబోలు. జరీనాకి ఏమైంది? సువాసనా భరితమైన అత్తరు చేసే జరీనా జీవితం విషాదాంతమైందా? గులాబీ పువ్వులాంటి జరీనా ఏ రాక్షసుడి పాదాల కింద నలిగిపోయిందో?

"ఏమైంది అత్తరు సాయిబూ? ఎందుకిలా అయిపోయావు? నీ అత్తరు వాసన చూడని ఈ ఊరివాళ్ల ముక్కులు మొద్దుబారిపోయాయి" తుపాను వెలసిన తరువాత అన్నాను.

"మీ అందరి కోసం అత్తరు చేసే నా కూతురు జరీనా జీవితాన్ని నేనే నాశనం చేసేశాను బాబూ! ఎక్కడుందో? ఎన్ని కష్టాలు పడుతోందో నా బంగారు తల్లి! జరీనాకి పెళ్లి కుదిరిందని చెప్పాను కదా బాబూ! ఆ దౌర్భాగ్యుడు నాటకమాడాడు. జరీనా మీద కన్నేసి అత్తర్లు అమ్ముకునే అల్లుడు కావాలన్న నా ఆశ ఎలా తెలుసుకున్నాడో ఏమో ఒక రోజున అత్తరు అమ్ముతూ పరిచయం అయ్యాడు. తల్లీ, తండ్రీ చిన్నప్పుడే చనిపోయారని, అత్తర్లే జీవనాధారంగా బ్రతుకుతున్నానని అబద్ధాలు చెప్పాడు. ఇల్లరికపుటల్లుణ్ణి చేసుకుంటే చిలకా గోరింకల్లా కళ్లముందే ఉంటారని ముచ్చట పడ్డాను. అమాయకురాలు జరీనా కూడా ఇష్టపడింది. నేను దూరం ఆలోచించలేదు. వయస్సులో ఉండి పరస్పర ఆకర్షణకి గురైన యువతీ యువకుల మధ్య ఆవేశం తప్ప ఆలోచన ఉండదు. మనస్సుని అర్పించిన కొన్నాళ్ల తర్వాత శరీరాన్ని కూడా అర్పించింది. అయినా నాదే తప్పు. ముక్కు, మొహం తెలియని వాడిని తీసుకొచ్చి ఇంట్లో పెట్టాను. అవసరం తీరిపోయిన తరువాత ఆ దరిద్రుడు ఎక్కడికో పారిపోయాడు. హఠాత్తుగా మారిపోయిన పరిస్థితి నన్ను పిచ్చివాణ్ణి చేసింది. నన్ను ఏదో సైతాన్ ఆవహించింది. నా కన్నకూతురి గర్భం పోవడానికి బలవంతంగా మందులు మింగించడానికి ప్రయత్నించాను. ఎప్పుడూ పరుషమైన మాట కూడా అనని జరీనాని ఒళ్లు హూనం అయ్యేలా కొట్టాను. జరిగిపోయిందేదో జరిగిపోయిందని కొడుకో, కూతురో పుడితే వాళ్లకోసం మిగిలిన జీవితం గడుపుతానని ఎంతో బ్రతిమాలింది. రాక్షసుడిగా మారిపోయిన నేను ఆ మాటలు వినలేదు. తల్లి కడుపు తీపి అంత ఉత్కృష్టమైనది కాబోలు. అల్లుడు చచ్చిపోయాడని ఒక ఏడుపు ఏడ్చి ఊరుకుంటే జరీనా నాకు బంగారం లాంటి మనవడినో, మనువరాలినో ఇచ్చేది. ఇంక చేసేదేమీ లేక ఒక రాత్రి ఇల్లు విడిచి వెళ్లిపోయింది. అయినా మా జీవితాలు ఇంతే బాబూ! మేము అందమైన గులాబీలని నిర్దాక్షిణ్యంగా నలిపివేస్తాము. మా జీవితాలు కూడా అలాగే నలిగిపోతాయి. సుగంధాన్ని అందరికీ అందించే మా జీవితాలు వేదనామయంగానే ఉంటాయి" అన్నాడు బాధగా.

నా తల తిరిగిపోయింది. జరీనాకి జరిగిన అన్యాయానికి నా హృదయం కరిగిపోయింది. కొందరి తలరాతని బ్రహ్మదేవుడు దారుణంగా ఎందుకు రాస్తాడో తెలియదు. అసలు సంగతి తెలిసిన తరువాత నాక్కూడా మాటలు రాలేదు. కొంతమంది పట్ల మనం ఎప్పుడూ చూడకపోయినా, మాట్లాడకపోయినా ఒక మంచిభావాన్ని ఆత్మీయతని పెంచుకుంటాం. అలాంటి కోవలోకే చెందినదే జరీనా. ఆమెపట్ల నా అభిమానం పెరిగిందే తప్ప తరగలేదు. ఎందుకో జరీనా దేవత లాంటిదని పించింది. దేవుడి తలపై అలంకరింపబడి శోభిల్లవలసిన పుష్పం నేలమీద పడి నలిగిపోతే ఆ తప్పు ఎవరిది? అతణ్ణి కొంతసేపు ఓదార్చి ఇంటికి బయలుదేరాను. చేసిన తప్పుకి జీవితాంతం కుమిలిపోయేలా శిక్ష విధించాడు విధాత. అయినా ఈ దేవుడి లీలలు చాలా విచిత్రంగా ఉంటాయి. అందమైన వాటినీ, వాటిని నలిపి నాశనం చేసే వాటినీ ఆయనే సృష్టిస్తాడు. అలా చేస్తే గాని సృష్టి చక్రం పూర్తికాదు కాబోలు. 'అడుసు త్రొక్కనేల, కాలు కడగనేల' అన్న సూక్తి ఆయనకి వర్తించదు కాబోలు! జరీనాని చూడలేదన్న దిగులు

మాత్రం స్పష్టంగా నాకు తెలిసింది.

కాలచక్రంలో మూడు సంవత్సరాలు తిరిగాయి. ట్రాన్స్‌ఫర్ కోసం ప్రయత్నించడానికి జిల్లా విద్యాశాఖాధికారి గారిని కలిసే నిమిత్తం పట్నం బయలుదేరాను. స్వంత ఊరికి ట్రాన్స్‌ఫర్ చెయ్యరుకాని ప్రస్తుతం ప్రయత్నం చేస్తున్న ఊరు దానికి దగ్గరలోనే ఉంది. "జననీ జన్మభూమిశ్చ" అన్న శ్లోకానికి అర్థం నాలో పాతుకుపోయింది. అత్తరు సాయిబుని నేను కలవడం అదే ఆఖరు. అతను మళ్లీ అత్తరు అమ్మడానికి రాలేదు. కూతురు గురించి బెంగ క్రుంగదీసినట్టుంది. అతని జీవితంలో ఏర్పడ్డ అగాధాన్ని ఎవరు పూడ్చగలరు? అప్పుడప్పుడు నాకు జరీనా కూడా గుర్తుకొస్తుండేది.

ఒక్కసారి కూడా చూడని జరీనా అంటే ఎందుకంతటి అభిమానం ఏర్పడిందో ఆ భగవంతుడికే తెలియాలి. మనుషుల మధ్య ఏర్పడే విచిత్రమైన సంబంధాలకి ఎవరూ భాష్యం చెప్పలేరు.

హెడ్డాఫీసులో పని పూర్తి చేసుకుని బయట పడ్డాను. సాయంత్రమైపోయింది. బస్సు వెంటనే దొరికితే మూడు గంటలే ప్రయాణం. అంటే పది గంటలలోపుల్లో వెళ్లిపోవచ్చు. ఆఫీసుకి కొత్త భవనాలు ప్రస్తుతం ఉన్న భవనం ప్రక్కనే కడుతున్నారు. కూలీలందరూ ఆ భవన సముదాయం ముందు వరుసగా నిలబడి ఉన్నారు. మేస్త్రీ వాళ్లందరికీ డబ్బులు ఇస్తున్నాడు. నా అడుగులు గబగబా ముందుకు పడ్డాయి.

"ఏయ్ జరీనా! పిల్లాడిని తీసుకొస్తే రేపటి నుంచి నువ్వు పనిలోకి రావద్దు. పిల్లాడిని చూసుకోవడానికే నీకు టైము సరిపోవడం లేదు". ఎవరినో కసురుతున్నాడు. అప్రయత్నంగా నా పెదాలు "జరీనా..... జరీనా......' అని ఉచ్చరించాయి. కాళ్లు ఆగిపోయాయి. సూర్యుడు పడమటి కొండల్లోకి జారిపోతూ ఆకాశమంతా లేత కుంకుమ రంగులోకి మార్చి లోకాన్ని చిరుచీకట్లతో చుట్టి వేస్తున్న సమయంలో జరీనాని చూసాను.

బక్కపల్చగా నాలుగడుగుల ఎత్తు ఉంది. గులాబీ అత్తరుని చేసే మృదువైన చేతులు రాళ్లని మోస్తున్నాయి. ఎవరి కోసం తండ్రిని వదిలేసి వచ్చిందో ఆ మూడేళ్ల కొడుకు తల్లి చెయ్యి పట్టుకుని భయం భయంగా నిలబడి ఉన్నాడు. జీవితంలో ఏర్పడ్డ తుపానుల కారణంగా తల నెరిసిపోయింది. మొహంలో ముడతలు కూడా వచ్చేశాయి. ఆమెకు పాతికేళ్లంటే ఎవరూ నమ్మరు. సమస్యల సుడిగుండంలో మునిగిపోయిన మనిషి ఎంత క్రుంగిపోయి వంగిపోతుందో జరీనాని చూస్తే తెలుస్తుంది.

నా శరీరంలోని ప్రతి అణువూ ఆనందంతో స్పందించింది. గట్టిగా గొంతెత్తి "జరీనా...... జరీనా....." అని పిలవాలనిపించింది. కూతురి కోసం కలవరించిపోతున్న ఆ ముసలి తండ్రి మోములో ఆనంద కమలాలు వికసింప చేసే అదృష్టం నాకు దేవుడు కల్పించాడు. చెదిరిపోయిన గూడుని సరిదిద్దే అవకాశం కలిగింది. యుద్ధంలో గెలిచిన వీరుడిలా జరీనా వైపు అడుగేశాను.

** ** **

నాకు ట్రాన్స్‌ఫర్ అయింది. నేను, శ్రీమతి, పిల్లలు అందరం కలసి సామాను సర్దుతున్నాం. గాలి సుగంధ భరితమైన పరిమళాన్ని మోసుకొచ్చింది. "అత్తరూ!" అన్న గొంతు మృదుమధురంగా వినబడింది. నేను నా శ్రీమతికేసి చూసి చిరునవ్వునవ్వాను.

"బుల్లి అత్తరు సాయిబు ఎలా ఉన్నాడు? మూడున్నర సంవత్సరాల తరువాత అత్తరు పట్టుకొచ్చావు. చాలా బావుందన్నానని జరీనాకి చెప్పు. ఈ ఊరిని వదిలిపెట్టి వెళ్లిపోతున్నాం. ఈ చిన్న సీసా ఏం సరిపోతుంది?" అన్నాను సీసా ఇస్తున్న అత్తరు సాయిబుతో.

మేము వెళ్లిపోతున్నామని చెప్పగానే అతని మొహంలో ఏదో నిరాశ కనబడింది. "నువ్వెళ్లిపోతున్నావా రాజారాం పంతులూ? నీ రుణం ఈ జన్మలో తీర్చుకోలేం. బూడిదై పోయిన మా బ్రతుకుల్లో నవ చైతన్యాన్ని నింపావు. నా జరీనా తల్లిని తెచ్చిపెట్టావు. చావు కోసం ఎదురు చూస్తున్న నన్ను బుల్లి మనవడి చిలిపి చేష్టలతో మళ్లీ బ్రతుకు మీద ఆశ పుట్టేలా చేశావు. మంచం మీద నుంచి సంవత్సరం పాటు లేవలేకపోయిన నేను ఈ రోజు ఇలా అత్తరు చేసి అమ్ముతున్నానంటే నీ చలవే.' అతని కళ్లల్లో కన్నీళ్లు సుళ్లు తిరిగాయి.

"సాయంత్రం ఆరు గంటల ట్రైనుకి వెళ్లిపోతున్నాము. అప్పుడప్పుడూ నీ అత్తరు కోసమైనా వస్తుంటానులే" అన్నాను. నాక్కూడా చాలా బాధగా ఉంది. ఆత్మీయులను దూరం చేసుకుంటున్న భావం కలుగుతోంది.

రైలు మరో నిమిషంలో బయలుదేరుతుందనగా వరుగు వరుగున ఆయాసపడుతూ వచ్చాడు అత్తరుసాయిబు. అతని భుజం మీద మనవడు ఉన్నాడు. వెనుక వచ్చింది జరీనా. ఆమె చేతిలో చిన్న 'సీసా' ఉంది. నీడ పట్టున ఉండడం వల్ల మళ్లీ శరీరం సహజమైన లేత ఎరుపు రంగులోకి వచ్చింది. మొహంలో దైన్యం స్థానంలో ఒక విధమైన గంభీరత చోటు చేసుకుంది. ఆ తండ్రీ కూతుళ్ల కళ్లు ఎన్ని వందల కృతజ్ఞతాజల్లుల్ని మౌనంగా చెప్పాయో లెక్కలేదు. జేబులో చెయ్యి పెట్టి చేతికొచ్చిన నోటుని అతని మనవడి చేతిలో పెట్టాను. నిద్రపోతున్నా అపురూపంగా దానిని పట్టుకున్నాడు. జరీనా సీసాని నా శ్రీమతి చేతిలో పెట్టింది. రైలు కదిలింది. వాళ్లిద్దరూ కనుమరుగైన తరువాత లోపలికొచ్చి జరీనా ఇచ్చిన సీసా మూత తెరిచాను. శ్రేష్ఠమైన గులాబీ అత్తరు వాసన రైలు పెట్టె అంతా గుప్పుమంది.

◆



పి. ఎం. - సి. ఎం.

టీచర్: పి.ఎం. అంటే ఎవరు? సి.ఎం. అంటే ఎవర్రా గోపీ?

గోపి: పి.ఎం. అంటే పెద్ద మినిస్టర్ సి.ఎం. అంటే చిన్న మినిస్టర్ మేడమ్!

ఎం. రమేష్ [మదనపల్లి]

## శిశువుల మేధా సామర్థ్యం

శిశువు పుట్టే సమయానికే మెదడు పూర్తిగా అభివృద్ధి చెంది వుంటుంది. వస్తువులను ముఖాలను గుర్తుపట్టడం, నవ్వడం, వెలుతురువైపు చూడడం వంటివి మనం గమనిస్తువుంటాం. అయితే అయిదారు నెలల వయస్సు శిశువులు తక్కువ సంఖ్యలో వున్న వస్తువులను బుద్ధిపూర్వకంగా లెక్కపెట్టి, గుర్తుపట్టగలరా లేకపోతే కేవలం చూపుతో అంకెల ప్రసక్తి లేకుండా గుర్తిస్తారా అనే విషయం చాలా కాలం నుంచి శాస్త్రవేత్తలలో వివాదాస్పదమైన చర్చనీయాంశంగా వుంది.

ఇటీవల అమెరికాలో అరిజోనా యూనివర్సిటీకి చెందిన కారెన్‌విన్ అనే పరిశోధకురాలు అయిదు నెలల వయసు పసిపిల్లలు చిన్న చిన్న అంకెలను కూడడం, తీసివేయడం చేయగలరని తెలిపే తన పరిశోధనా ఫలితాలను ప్రకటించింది. అంకగణిత సామర్థ్యం శిశువులలో స్వతహాగా వుంటుందని, అదే భవిష్యత్తులో వారి అంకగణిత పరిజ్ఞానం అభివృద్ధి చెందడానికి పునాదిని ఏర్పరుస్తుందని ఆమె ప్రతిపాదించింది.

అయిదు నెలల శిశువులకు ఒకటి రెండు వస్తువులను ఒక చోట కలిపి వుంచి, తరవాత వాటిలో ఒకటి తీసివేసి చూపించింది. ఉదాహరణకు 1 + 1 లేదా 2 – 1 వంటివి. తరవాత వారికి ఆ వస్తువులను 1 + 1 = 2 అనీ 1 + 1 = 1 అని అర్థం వచ్చేట్లు అమర్చి చూపించింది. శిశువులకు కలపడం, తీసివేయడం వంటి సామర్థ్యాలుంటే, తప్పు సమాధానం వచ్చేట్లుగా వస్తువులను అమర్చినప్పుడు వారు ఎక్కువసేపు తేరిపారి చూస్తారని అనుకోవచ్చు. డా. విన్ ప్రయోగాలలో సరిగ్గా అలాగే జరిగింది. అంటే వస్తువుల సంఖ్యలో మార్పును వారు గ్రహించగలరని సూచన లభించింది.

అయితే పదార్థం పరిమాణం పెరగడం, తగ్గడం మాత్రమే శిశువులు గమనిస్తారు. కాని సంఖ్యలలో వ్యత్యాసాలు కాదని వాదించవచ్చు. అయితే ఇందుకు సమాధానంగా లోగడ జరిపిన పరిశోధనలలో శిశువులు వేరువేరు వస్తువులను గుర్తించగలరని గమనించడం జరిగింది.

శిశువుల తల్లిదండ్రులు తమ శిశువులతో ఇటువంటి ప్రయోగాలు చేసి చూసుకోవచ్చు.

- డాక్టర్ ఆర్.ఎల్.ఎన్.శాస్త్రి